

## స్మగ్లర్ల గుప్పిట్లో అటవీశాఖ?

అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
J V NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 3 సంచిక -103 బుధవారం 23 సెప్టెంబర్ 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -6 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts




## చిన్న వ్యాపారులపై భారం లేనట్లే!

**యూపీఐ ఛార్జీలపై ఎన్‌పీసీఐ కీలక ప్రకటన..**

**యూపీఐ ఎండీఆర్‌పై జీఎస్టీ భారం అంటూ వస్తున్న వార్తలు అవాస్తవం**

**రూ.2,000 లోపు లావాదేవీలపై ఎలాంటి ఛార్జీలు, జీఎస్టీ ఉండదని స్పష్టీకరణ**

**నెలకి లక్ష లోపు యూపీఐ వసూళ్లున్న వ్యాపారులపై ప్రభావం శూన్యమని వెల్లడి**

**వ్యక్తుల మధ్య జరిగే లావాదేవీలు యథాతథంగా పూర్తిగా ఉచితమని స్పష్టత**

**చెల్లించిన జీఎస్టీని ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ కింద సర్దుబాటు చేసుకోవచ్చన్న ఎన్‌పీసీఐ**

## ఎస్సీ, ఎస్టీ బాధిత కుటుంబాలకు
# సత్వర న్యాయం

**గ్రీన్ ఛానల్ ద్వారా నిధులు విడుదల**

**వెంటనే నష్ట పరిహారం చెల్లింపు**

**రెగ్యులర్ గా జిల్లా స్థాయి విజిలెన్స్ కమిటీల సమావేశాలు**

**:రాష్ట్ర స్థాయి ఉన్నత నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి**



**హైదరాబాద్ (జర్నలిస్ట్ వార్త);**
ఎస్సీ, ఎస్టీలపై అట్రాసిటీ కేసుల్లో బాధిత కుటుంబాలకు సత్వర న్యాయం చేయాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ లోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం1989 అమలుపై రాష్ట్ర స్థాయి ఉన్నత నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం జరిగింది. రాష్ట్రంలో చట్టం అమలు, నమోదైన కేసులు, దర్యాప్తు పురోగతి, న్యాయస్థానాల్లో విచారణ, కేసుల పరిష్కారం, బాధితులకు అందుతున్న ఆర్థిక సహాయం, పునరావాస చర్యలను ఈ సందర్భంగా సీఎం సమీక్షించారు. కేసుల విచారణ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక న్యాయస్థానాలు, మొబైల్ కోర్టుల పని తీరుతో పాటు చట్టంపై చేపడుతున్న అవగాహన కార్యక్రమాలపై సమావేశంలో చర్చించారు. **మిగతా 2లో...**

## ఆసియా క్రీడలు 2026లో
# భారత్‌కు తొలి స్వర్ణం



**మహిళల క్రికెట్ ఫైనల్లో శ్రీలంకపై 147 పరుగుల తేడాతో విజయం**

**దేశం గర్విస్తోందంటూ జట్టును అభినందించిన ప్రధాని మోదీ**

**చారిత్రక విజయమంటూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రశంస**

**ఢిల్లీ సెప్టెంబర్ 22(జర్నలిస్ట్ వార్త);**
ఆసియా క్రీడలు–2026లో భారత్ స్వర్ణ పతకాల ఖాతాను ఘనంగా ప్రారంభించింది. భారత మహిళా క్రికెట్ జట్టు అద్భుత ప్రదర్శన కనబరిచి, ఈ ఎడిషన్‌లో దేశానికి తొలి బంగారు పతకాన్ని అందించింది. ఫైనల్ పోరులో శ్రీలంకను 147 పరుగుల భారీ తేడాతో ఓడించి, వరుసగా రెండోసారి స్వర్ణాన్ని కైవసం చేసుకుంది. హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని టీమ్ఇండియా టోర్నీ ఆద్యంతం తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. **మిగతా 2లో...**

## వైభవంగా జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రదానోత్సవం..

**తెలుగు చిత్రాలకు 9 అవార్డులు**



**ఢిల్లీ సెప్టెంబర్ 22(జర్నలిస్ట్ వార్త);**
ప్రతిష్ఠాత్మకమైన 72వ జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రదానోత్సవం గుజరాత్‌లో వైభవంగా జరిగింది. రాష్ట్రంలోని స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ వేదికగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. గుజరాత్‌లో అవార్డు ప్రదానోత్సవం జరగడం ఇదే తొలిసారి. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పలువురు సినీకళాకారులు పురస్కారాలు అందుకున్నారు. **మిగతా 2లో...**

## వందేమాతరం పాడనంత మాత్రాన క్రిమినల్ చర్యలొద్దు

**మతపరమైన, మనస్సాక్షికి సంబంధించిన అభ్యంతరాలకు రక్షణ**

**జాతీయ గీతంగా వందేమాతరం హోదాను ప్రశ్నించలేమని స్పష్టీకరణ**

**గాయకుడు టీఎం కృష్ణ పిటిషన్‌పై విచారణ సందర్భంగా కీలక వ్యాఖ్యలు**

**ఢిల్లీ సెప్టెంబర్ 2(జర్నలిస్ట్ వార్త);**
వందేమాతరం గీతాన్ని ఆలపించలేదన్న కారణంతో వ్యక్తులపై క్రిమినల్ చర్యలు తీసుకోవడానికి వీల్లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. మతపరమైన విశ్వాసాలు లేదా మనస్సాక్షికి సంబంధించిన కారణాలతో ఎవరైనా ఈ గీతాన్ని **మిగతా 2లో...**



# 4 జిల్లాలకు వరదముప్పు

**భద్రాద్రి, ఖమ్మం, సూర్యాపేట, మహబూబ్‌నగర్‌లో కుంభవృష్టి**

**భారత వాతావరణ శాఖ హెచ్చరిక**

**బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం**

**నేటి రాత్రి తీరం దాటే అవకాశం**

**హైదరాబాద్ (జర్నలిస్ట్ వార్త);**
బంగాళాఖాతంలో వాయుగుండం మంగళవారం సాయంత్రానికి తీవ్ర వాయుగుండంగా బలపడింది. దీంతో తెలంగాణలోని నాలుగు జిల్లాలకు ఆకస్మిక వరదల ముప్పు పొంచి ఉంద ని భారత వాతావరణశాఖ(ఐఎండీ) హెచ్చరించింది. భద్రాద్రి, ఖమ్మం, సూర్యాపేట, మహబూబ్‌నగర్ జిల్లాల్లో **మిగతా 2లో...**



## అక్రమాస్తుల కేసులో నిమ్స్ అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ అరెస్ట్




**నిమ్స్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీభాస్కర్‌పై ఏసీబీ దాడులు**

**రూ.80 కోట్లకు పైగా విలువైన ఆస్తులను గుర్తించిన అధికారులు**

**హైదరాబాద్, విశాఖ, ఇతర ప్రాంతాల్లో ఫ్లాట్లు, ప్లాట్లు, బంగారం**

**బ్యాంకుల్లో రూ.41 లక్షల నగదు, ప్రైవేటు సంస్థల్లో రూ.35 లక్షల పెట్టుబడులు**

**20 ఏళ్లుగా నిమ్స్‌లో పనిచేస్తున్న లక్ష్మీభాస్కర్‌పై గతంలోనూ ఆరోపణలు**

**హైదరాబాద్ సెప్టెంబర్ 22(జర్నలిస్ట్ వార్త);**
హైదరాబాద్‌లోని ప్రతిష్టాత్మక నిమ్స్ ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నోరి లక్ష్మీభాస్కర్ నివాసంలో భారీగా ఆస్తులు వెలుగుచూశాయి. ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారన్న ఆరోపణలతో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు మంగళవారం ఏకకాలంలో ఆయన నివాసం, కార్యాలయంతో పాటు మరో ఏడు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సుమారు రూ .80 కోట్లకు పైగా విలువైన స్థిర, చరాస్తులను **మిగతా 2లో...**


## 250 మందికి పైగా వైసీపీ నేతలపై కేసులు నమోదు

**టీచర్లపై వైసీపీ దాడులు.. జోగి రమేశ్, వెల్లంపల్లి, దేవినేని అవినాశ్ తదితరులపై కేసులు**

**విజయవాడ సెప్టెంబర్ 22(జర్నలిస్ట్ వార్త);**
విజయవాడలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) కార్యాలయం ఎదుట టీచర్లపై వైసీపీ నాయకులు, శ్రేణులు జరిపిన భౌతిక దాడి ఉదంతాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అత్యంత తీవ్రంగా పరిగణించింది. **2లో...**



# జూరాలకు నీళ్లివ్వండి..



**కర్ణాటక సీఎంకు రేవంత్ ఫోన్**

**జూరాలకు 5 టీఎంసీల నీరు ఇవ్వాలని కోరిన రేవంత్**

**శివకుమార్ సానుకూలంగా స్పందించినట్లు సమాచారం**

**బెంగళూరులో శివకుమార్‌తో మంత్రులు, ఎమ్మెల్యేల భేటీ**

**విడతల వారీగా నీటిని విడుదల చేయాలని విజ్ఞప్తి**

**జూరాల నీటి కోసం రైతుల ఆందోళన**

**హైదరాబాద్ (జర్నలిస్ట్ వార్త);**
ఉమ్మడి పాలమూరు జిల్లాలో సాగునీటి సమస్యపై సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా రంగంలోకి దిగారు. జూరాల ప్రాజెక్టుకు ఐదు టీఎంసీల నీటిని విడుదల చేయాలని కర్ణాటక సీఎం డీకే శివకుమార్‌ను కోరారు. **2లో...**

## ఏసీ పేలి ముగ్గురు నవజాత
# శిశువులు మృతి

**ఆదిలాబాద్ రిమ్స్‌లో అగ్ని ప్రమాదం24 మందికి అస్వస్థత .**

**.ప్రయివేటు ఆస్పత్రులకు తరలింపు -విచారణకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం**

**ఆస్పత్రిని సందర్శించినవైద్యారోగ్య శాఖ మంత్రి**



**ఆదిలాబాద్ (జర్నలిస్ట్ వార్త);**
ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రిలో సోమవారం అర్ధరాత్రి భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. తల్లి గర్భం నుంచి బయటకు వచ్చి కండ్లు కూడా సరిగా తెరవని నవజాత శిశువులు చికిత్స పొందుతున్న ప్రత్యేక నవజాత శిశు సంరక్షణ కేంద్రంలో ఏసీలో షార్ట్‌సర్క్యూట్‌తో పేలుడు సంభవించింది. **మిగతా 2లో...**

## ఆసియా క్రీడలు 2026లో భారత్‌కు తొలి స్వర్ణం

**మొదటిపేజీ తరువాయి**

ఈ చారిత్రక విజయంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పందిస్తూ జట్టుకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. "భారత క్రికెట్‌కు ఇదొక అద్భుతమైన విజయం. మన క్రీడాకారిణులు పూర్తి ఆధిపత్యం ప్రదర్శించడం అభినందనీయం. వారి ఆత్మవిశ్వాసం, నైపుణ్యం, సమష్టి కృషి అమోఘం. ఈ విజయంతో దేశం గర్విస్తోంది. మీరు యువ క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలిచారు" అని మోదీ ప్రశంసించారు. మరోవైపు ఆసియా క్రీడల్లో తొలిసారిగా ప్రవేశపెట్టిన ఎంఎంఏ విభాగంలో పతకం సాధించిన సుచికా తరియల్‌ను కూడా ప్రధానమంత్రి అభినందించారు.రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సైతం భారత జట్టును అభినందించారు. ఈ విజయం చరిత్రలో నిలిచిపోతుందని, రాబోయే తరాలకు, ముఖ్యంగా దేశంలోని యువతకు ఇది గొప్ప స్ఫూర్తిదాయకమని కొనియాడారు. క్రికెట్ దిగ్గజం సచిన్ టెండుల్కర్ స్పందిస్తూ, షఫాలీ వర్మ, స్మృతి మంధానల అద్భుత భాగస్వామ్యాన్ని, బౌలర్ల ప్రతిభను ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ చారిత్రక విజయంతో భారత మహిళా జట్టుపై దేశవ్యాప్తంగా ప్రశంసల వర్షం కురుస్తోంది.

## జూరాలకు నీళ్లివ్వండి..

**మొదటిపేజీ తరువాయి**

మంగళవారం ఫోన్‌లో మాట్లాడిన రేవంత్‌రెడ్డి.. జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను ఆయనకు వివరించారు.జూరాల నుంచి సాగునీరు అందక ఇప్పటికే సాగు చేసిన పంటలు ఎండిపోయే పరిస్థితి ఉందని తెలిపారు. రైతుల పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ఐదు టీఎంసీల నీటిని జూరాలకు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై శివకుమార్ సానుకూలంగా స్పందించినట్లు సమాచారం.



రేవంత్‌రెడ్డి ఆదేశాలతో మంత్రులు జూపల్లి కృష్ణారావు, శ్రీహరి, ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, మేగా రెడ్డి, జి. మధుసూదన్‌రెడ్డి మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిశారు. కర్ణాటక సీఎంతో చర్చించాల్సిన అంశాలపై వారితో మాట్లాడారు.
అనంతరం మంత్రులు, ఎమ్మెల్యేలు బెంగళూరుకు బయలుదేరారు. మంగళవారం రాత్రి 8 గంటలకు శివకుమార్‌తో భేటీ కానున్నారు. జూరాలకు నీరు ఇచ్చేందుకు సానుకూలంగా స్పందించినందుకు ఆయనకు కృతజ్ఞతలు చెప్పనున్నారు. ఐదు టీఎంసీల నీటిని ఒకేసారి కాకుండా విడతల వారీగా విడుదల చేయాలని కోరనున్నారు.జూరాలకు సాగునీరు విడుదల చేయాలని కోరుతూ రైతులు ఇప్పటికే ఆందోళనకు దిగారు. ఈ ఆందోళనలకు బీఆర్ఎస్ మద్దతు ప్రకటించింది. బీజేపీ కూడా ఈ అంశంపై స్పందించింది. దీంతో జూరాల నీటి వ్యవహారం రాజకీయంగానూ ప్రాధాన్యం సంతరించుకుంది.

## వందేమాతరం పాడనంత మాత్రాన క్రిమినల్ చర్యలొద్దు

**మొదటిపేజీ తరువాయి**

పాడటానికి నిరాకరిస్తే, వారిపై ఎటువంటి శిక్షార్హమైన చర్యలు ఉండబోవని అత్యున్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. అదే సమయంలో, జాతీయ గీతంగా వందేమాతరం హోదాను న్యాయస్థానాలు సమీక్షించలేవని కూడా స్పష్టం చేసింది.ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసుడు టీఎం కృష్ణ దాఖలు చేసిన పిటిషన్‌పై మంగళవారం సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం ఈ సందర్భంగా పలు కీలక వ్యాఖ్యలు చేసింది. వందేమాతరంలోని ఆరు చరణాలను ఆలపించాలన్న కేంద్ర ప్రభుత్వ సర్క్యులర్‌ను, అలాగే జాతీయ చిహ్నాలను అవమానించకుండా నిరోధించే చట్టం-2026 సవరణను టీఎం కృష్ణ సవాల్ చేశారు. గీతంలోని చివరి నాలుగు చరణాలలో హిందూ దేవతల ప్రస్తావన ఉండటం రాజ్యాంగబద్ధమైన లౌకిక స్ఫూర్తికి, మత స్వేచ్ఛకు విరుద్ధమని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు.విచారణ సందర్భంగా ధర్మాసనం స్పందిస్తూ, "వందేమాతరం సుదీర్ఘ కాలంగా జాతీయ గీతంగా కొనసాగుతోంది, దాని హోదాను మేము ప్రశ్నించలేము" అని వ్యాఖ్యానించింది. అయితే, ఆర్టికల్స్ 25, 26 ప్రకారం మత విశ్వాసాలు లేదా వ్యక్తిగత విచక్షణ కారణంగా ఎవరైనా ఈ గీతాన్ని పాడటానికి అభ్యంతరం వ్యక్తం చేస్తే, వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోలేమని ధర్మాసనం స్పష్టం చేసింది. వ్యక్తులు తమ ఇష్టానుసారం ఒకటి లేదా అంతకంటే ఎక్కువ చరణాలను పాడవచ్చని లేదా అస్సలు పాడకుండా ఉండవచ్చని కోర్టు అభిప్రాయపడింది.
1986 నాటి చరిత్రాత్మక బిజో ఇమ్మాన్యుయేల్ కేసులో, మత విశ్వాసాల కారణంగా జాతీయ గీతాన్ని పాడలేమని కోరిన జెహోవా సాక్షుల విభాగానికి చెందిన విద్యార్థులకు సుప్రీంకోర్టు రక్షణ కల్పించిన విషయాన్ని ఈ సందర్భంగా ధర్మాసనం గుర్తు చేసింది. ప్రాథమిక హక్కులను ప్రాథమిక విధులు అధిగమించలేవని ఆ తీర్పు స్పష్టం చేసిందని పేర్కొంది. ప్రస్తుత పిటిషన్‌లో కేవలం క్రిమినల్ చర్యలకు సంబంధించిన అంశాన్ని మాత్రమే పరిశీలిస్తామని, గీతంలోని సాహిత్యంపై లేదా దాని అధికారిక హోదాపై ఎటువంటి తీర్పు ఇవ్వబోమని న్యాయస్థానం వెల్లడించింది.

## వైభవంగా జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రదానోత్సవం..

**మొదటిపేజీ తరువాయి**

ప్రముఖ కన్నడ నటుడు అనంత్ నాగ్ దాదా సాహెబ్ ఫాల్కే అవార్డును రాష్ట్రపతి చేతులమీదుగా అందుకున్నారు.మలయాళ సూపర్ స్టార్ మమ్ముట్టి, బాలీవుడు నటుడు కార్తిక్ ఆర్యన్ సంయుక్తంగా ఉత్తమ నటుడి అవార్డును అందుకున్నారు. చందూ ఛాంపియన్ చిత్రానికి కార్తిక్ ఆర్యన్‌ను, భ్రమయుగం చిత్రానికి మమ్ముట్టిని ఈ అవార్డు వరించింది. కల్కి 2898 ఏడీ ప్రజాదరణ పొందిన ఉత్తమ చిత్రంగా నిలిచింది. ఉత్తమ చిత్రంగా ఆర్టికల్ 370 నిలిచింది. ఆ చిత్రంలో నటించిన యామీ గౌతమ్ ఉత్తమ నటిగా అవార్డు అందుకున్నారు. అమరన్ చిత్రానికి ఉత్తమ దర్శకుడిగా రాజ్‌కుమార్ పెరియసామి అవార్డును అందుకున్నారు. ఈసారి తెలుగు సినిమాలు కూడా సత్తా చాటాయి. 'కల్కి 2898'తో పాటు 'కమిటీ కుర్రోళ్లు', '35.. చిన్న కథ కాదు', 'పుష్ప-2', 'లక్కీ భాస్కర్' సహా పలు చిత్రాలు వివిధ విభాగాల్లో మొత్తం 9 అవార్డులను సొంతం చేసుకున్నాయి.చలనచిత్ర అవార్డుల ప్రదాన కార్యక్రమం సాధారణంగా ఢిల్లీలో విజ్ఞాన్ భవన్‌లో జరుగుతున్న విషయం తెలిసిందే. 1954 నుంచి ఈ వేదికగానే అవార్డు ప్రదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. 1971లో ఓసారి మాత్రమే చెన్నైలో జరిగింది. ఇక కరోనా సమయంలో రెండేళ్ల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించలేదు.

## అక్రమాస్తుల కేసులో నిమ్స్ అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ అరెస్ట్

**మొదటిపేజీ తరువాయి**

గుర్తించడంతో అధికారులు విస్తుపోయారు.ఏసీబీ గుర్తించిన ఆస్తుల వివరాల ప్రకారం, కూకట్‌పల్లిలో రెండు విలాసవంతమైన ఫ్లాట్లు, మణికొండ, పేట్ బషీరాబాద్ ప్రాంతాల్లో మరో ఐదు ఫ్లాట్లు ఉన్నాయి. వీటితో పాటు యాదాద్రి, నందిగామ, శామీర్‌పేటలో నాలుగు ఓపెన్ ప్లాట్లు, విశాఖపట్నంలో 800 గజాల స్థలం ఉన్నట్లు తేలింది. అలాగే, వివిధ బ్యాంకు ఖాతాల్లో రూ. 41 లక్షల నగదు, పోస్టాఫీసు ఖాతాల్లో రూ. 12 లక్షల డిపాజిట్లు, ఒక ప్రైవేటు సంస్థలో రూ. 35 లక్షల పెట్టుబడులు ఉన్నట్లు అధికారులు కనుగొన్నారు. వీటితో పాటు 517 గ్రాముల బంగారం, మూడు కార్లు, నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.డాక్టర్ లక్ష్మీభాస్కర్ గత 20 ఏళ్లుగా నిమ్స్‌లో పనిచేస్తుండగా, గత ఐదేళ్లుగా డిప్యూటీ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆయనపై గతంలోనూ పలు ఆరోపణలు వచ్చినట్లు సమాచారం. ప్రస్తుతం ఏసీబీ అధికారులు లభ్యమైన ఆస్తుల పూర్తి విలువను అంచనా వేసే పనిలో నిమగ్నమయ్యారు.

## 250 మందికి పైగా వైసీపీ నేతలపై కేసులు నమోదు

**మొదటిపేజీ తరువాయి**

సమాజానికి దిశానిర్దేశం చేసే గురువులపై దౌర్జన్యాలు, భౌతిక దాడులు చేయడాన్ని ఏమాత్రం సహించేది లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు నారా లోకేశ్, వంగలపూడి అనిత స్పష్టం చేశారు. ఈ ఘటనకు పాల్పడిన బాధ్యులందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని విజయవాడ పోలీస్ కమిషనర్‌ను సీఎం ఆదేశించారు.దీనిపై వేగంగా స్పందించిన పోలీసులు విజయవాడలోని సూర్యారావుపేట, మాచవరం, కృష్ణలంక పోలీస్ స్టేషన్లలో కలిపి మొత్తం 6 క్రిమినల్ కేసులు నమోదు చేశారు. 250 మందికి పైగా వైసీపీ నాయకులు, శ్రేణులు, రౌడీషీటర్లపై హత్యాయత్నం, ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం, విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులపై దాడి, చట్టవిరుద్ధంగా గుమిగూడటం వంటి తీవ్రమైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. కేసులు నమోదైన వారిలో మాజీ మంత్రులు జోగి రమేశ్, వెల్లంపల్లి శ్రీనివాస్, నేతలు జక్కంపూడి రాజా, దేవినేని అవినాశ్, పేర్ని కిట్టు, నాగార్జున యాదవ్ తదితరులు ఉన్నారు.
మరోవైపు వైపు, వైసీపీ విద్యార్థి విభాగం నాయకుడు రవిచంద్రను పోలీసులు ఇప్పటికే అరెస్టు చేసి మాచవరం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దాడిలో పాల్గొన్న పలువురు రౌడీషీటర్లను పట్టుకోవడానికి ప్రత్యేక పోలీస్ బృందాలు గాలిస్తున్నాయి.

# చిన్న వ్యాపారులపై భారం లేనట్లే!

**యూపీఐ ఛార్జీలపై ఎన్‌పీసీఐ కీలక ప్రకటన..**

**ఢిల్లీ సెప్టెంబర్ 22(జర్నలిస్ట్ వార్త):**
యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా చేసే చెల్లింపుల్లో మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) పై జీఎస్టీ విధిస్తారని, దీనివల్ల డిజిటల్ చెల్లింపులు ఖరీదుగా మారతాయని, ముఖ్యంగా చిన్న వ్యాపారులపై భారం పడుతుందని కొన్ని మీడియా మాధ్యమాలలో వస్తున్న వార్తలను 'నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా' (ఎన్‌పీసీఐ) ఖండించింది. ఈ ఆందోళనలు పూర్తిగా అవాస్తవమని, అపోహలు మాత్రమేనని ఒక ప్రకటనలో స్పష్టం చేసింది.ఎన్‌పీసీఐ వివరణ ప్రకారం, ఎండీఆర్ అనేది కేవలం రూ.2,000 కంటే ఎక్కువ విలువైన 'పర్సన్-టు-మర్చంట్' (పీ2ఎం) లావాదేవీలకు మాత్రమే వర్తిస్తుంది. రూ.2,000 వరకు జరిపే లావాదేవీలకు ఎలాంటి ఎండీఆర్ లేనందున, వాటిపై జీఎస్టీ ప్రభావం కూడా ఉండదని స్పష్టం చేసింది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం దేశంలో జరిగే మొత్తం యూపీఐ మర్చంట్ లావాదేవీల్లో 96% పైగా రూ.2,000 లోపువేనని, అందువల్ల అత్యధిక లావాదేవీలపై ఈ మార్పు ప్రభావం ఏమాత్రం ఉండదని పేర్కొంది.
అంతేకాకుండా, నెలకు లక్ష రూపాయల వరకు యూపీఐ ద్వారా చెల్లింపులు స్వీకరించే చిన్న వ్యాపారులు ఎండీఆర్ చెల్లించాల్సిన అవసరం లేదని, కాబట్టి వారికి జీఎస్టీ సమస్యే ఉత్పన్నం కాదని తెలియజేసింది. ఒకవేళ రూ.2,000 పైబడి లావాదేవీలు జరిపి ఎండీఆర్ చెల్లించే వ్యాపారులు దానిపై జీఎస్టీ కట్టినా, ఆ మొత్తాన్ని వారు విక్రయించే వస్తువులపై చెల్లించాల్సిన జీఎస్టీ నుంచి మినహాయింపు (ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్) పొందవచ్చని వివరించింది. ఫలితంగా, వ్యాపారులపై ఈ జీఎస్టీ భారం వాస్తవానికి ఉండదని ఎన్‌పీసీఐ స్పష్టం చేసింది.
వ్యక్తుల మధ్య జరిగే 'పర్సన్-టు-పర్సన్' (పీ2పీ) లావాదేవీలపై ఈ నిబంధనల ప్రభావం ఏమాత్రం ఉండదని కేంద్ర ఆర్థిక శాఖ ఇదివరకే స్పష్టం చేసింది. ఎంత మొత్తం బదిలీ చేసినా ఈ లావాదేవీలు ఎప్పటిలాగే పూర్తిగా ఉచితంగానే కొనసాగుతాయి. ఎండీఆర్ అనేది ప్రభుత్వం లేదా ఎన్‌పీసీఐ వసూలు చేసే పన్ను కాదని, యూపీఐ వ్యవస్థ నిర్వహణ, విస్తరణకు సహకరించేందుకు బ్యాంకులు, పేమెంట్ యాప్ ప్రొవైడర్ల వంటి భాగస్వాములకు పంచే రుసుము అని కూడా వివరించింది.కొత్త నిబంధనల ప్రకారం రూ.2,000 దాటిన పీ2ఎం లావాదేవీలపై 0.4% నామమాత్రపు ఎండీఆర్ వర్తిస్తుంది. రూ.75,000, ఆపైబడిన లావాదేవీలకు ఎండీఆర్ గరిష్ఠంగా రూ.300గా పరిమితం చేశారు. రైల్వే, టెలికాం, ఇంధనం, వ్యవసాయం వంటి అత్యవసర, తక్కువ మార్జిన్లు ఉండే రంగాల్లో రూ.2,000 దాటిన లావాదేవీలకు ఒక్కోదానికి కేవలం రూ.5 ఫ్లాట్ ఛార్జీ వర్తిస్తుందని ఎన్‌పీసీఐ తెలిపింది.

# ఎస్సీ, ఎస్టీ బాధిత కుటుంబాలకు సత్వర న్యాయం

**మొదటిపేజీ తరువాయి**



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2013 ఫిబ్రవరి 11న అప్పటి ముఖ్యమంత్రి అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ నిరోధక చట్టం అమలుపై రాష్ట్ర స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం ముఖ్యమంత్రి అధ్యక్షతన రాష్ట్ర స్థాయి ఉన్నత నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం జరగడం ఇదే తొలిసారి.ఈ సందర్భంగా రాష్ట్రంలో క్రమంగా ఐదేండ్లలో ఎస్సీ, ఎస్టీలపై అట్రాసిటీ కేసులు తగ్గుముఖం పట్టాయని అధికారులు సీఎంకు వివరించారు. రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో, ప్రధానంగా 73 గ్రామాల్లో ఎక్కువ కేసులు నమోదవుతున్నాయని నివేదించారు. అక్కడ పోలీసు విభాగం ప్రత్యేకంగా దృష్టి పెట్టాల్సిన అవసరముందని తెలిపారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా స్థాయి విజిలెన్స్ కమిటీల సమావేశాలు క్రమం తప్పకుండా జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ నిరోధక చట్టం కింద బాధితులకు చెల్లించాల్సిన నష్ట పరిహారాన్ని వెంటనే చెల్లించాలని వారికి సూచించారు. అందుకు అవసరమైన నిధులను బడ్జెట్ కేటాయింపులతో ముడిపెట్టకుండా గ్రీన్ ఛానెల్ ద్వారా విడుదల చేయాలన్నారు. అట్రాసిటీ ఘటనల్లో బాధితుల పట్ల ప్రభుత్వం మానవీయ కోణంలో స్పందించాలని, వారికి సకాలంలో నష్టపరిహారం, సహాయం, పునరావాసం అందేలా చూడాలని స్పష్టం చేశారు. ఇటీవల షాబాద్ హత్యల కేసు, తుక్కుగూడలో నర్సుపై హత్యాచారం కేసులను ముఖ్యమంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఇందిరాగాంధీ స్ఫూర్తితోనే..పేదలకు 25 లక్షల ఎకరాల అసైన్డ్ భూముల పట్టాలు అందించిన ఘనత మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీదని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. ఆమె స్ఫూర్తితోనే రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తున్నదని తెలిపారు. రాష్ట్ర బడ్జెట్లో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు జనాభా దామాషా ప్రకారం నిధులు కేటాయిస్తున్నామని ముఖ్యమంత్రి చెప్పారు. వారికి ప్రతి ప్రభుత్వ పథకం, కార్యక్రమంలో తగినంత ప్రాధాన్యమిస్తున్నట్టు చెప్పారు. దళితులు, గిరిజనులను కాంగ్రెస్ సొంత బిడ్డల్లా ఆదరించిందనీ, అందుకే నేటికీ ఇందిరాగాంధీని పల్లెపల్లెనా స్మరించుకుంటున్నారని తెలిపారు. విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి ద్వారానే సమాజంలో మార్పు వస్తుందని సీఎం అభిప్రాయం వ్యక్తం చేశారు. ఎస్సీ ఎస్టీలపై అణిచివేతను అధిగమించేందుకు రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఎస్సీ జనాభా దాదాపు 16 శాతం ఉంటే ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో 31 శాతం మంది లబ్దిదారులు, ఎస్టీల జనాభా 10 శాతం ఉంటే కేటాయింపుల్లో 17 శాతం ఇండ్లను మంజూరు చేశామని సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు. రాష్ట్రంలోని 27.5 లక్షల మంది విద్యార్థులకు నర్సరీ నుంచి పన్నెండో తరగతి వరకు అల్పాహారం అందిస్తున్నామని తెలిపారు. 3.48 కోట్ల మందికి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని, వీటితో దళితులు, గిరిజనులు, ఆదివాసీలు సహా పేద కుటుంబాలకు నాణ్యమైన భోజనం అందుతోందన్నారు. దళితులు, గిరిజనులు, ఆదివాసీల అవసరాలను దృష్టిలో ఉంచుకునే ప్రభుత్వం సంక్షేమ పథకాలను రూపొందించి అమలు చేస్తోందన్నారు. విద్యతో పాటు క్రీడల్లోనూ ప్రోత్సహించాలని, కాంగ్రెస్ ప్రభుత్వం అట్టడుగు వర్గాల అభివృద్ధి కోసమే పని చేస్తుందని సీఎం స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎంపీలు మల్లు రవి, బలరాం నాయక్, కడియం కావ్య, ఎమ్మెల్యేలు తోట లక్ష్మీకాంతరావు, మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, వేముల వీరేశం, మందుల సామేల్, మట్టా రాగమయి, వెడ్మ బొజ్జు, మురళీ నాయక్, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్, రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మెన్ బక్కి వెంకటయ్య, జాతీయ ఎస్సీ కమిషన్ డైరెక్టర్ సునీల్ బాబు, ఎస్సీ కమిషన్ సభ్యులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు

# ఏసీ పేలి ముగ్గురు నవజాత శిశువులు మృతి

**మొదటిపేజీ తరువాయి**

దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో దట్టమైన పొగలు వ్యాపించాయి. వైద్య సిబ్బంది కేకలు వేస్తూ బయటకి వచ్చి ఎస్ఎన్‌సీయూ వార్డులో మంటలు వస్తున్నాయని తెలపడంతో వెంటనే అప్రమత్తమైన సిబ్బంది ఆ విభాగానికి చేరుకుని 27 మంది నవజాత శిశువులను కాపాడారు. అందులో ఒకరు అప్పటికే మృతి చెందారు. ఇద్దరు చిన్నారులు చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ప్రాణం కోల్పోయారు.

**అర్ధరాత్రి ఉరుకులు పరుగులు**

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(రిమ్స్)లోని ప్రత్యేక నవజాత శిశు సంరక్షణ కేంద్రంలో సోమవారం 11.45 గంటల సమయంలో కు ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఆ విభాగంలోని రిసెప్షన్ వద్ద ఉన్న ఏసీలో షార్ట్‌సర్క్యూట్‌తో పేలుడు సంభవించింది. అందులోని గ్యాస్ లీకై దట్టమైన పొగ అలుముకుంది. అక్కడున్న వైద్యులు, సిబ్బంది భయంతో పరుగులు తీశారు. దీంతో అక్కడ ఏం జరుగుతుందో తెలియని అయోమయం నెలకొంది. తల్లిదండ్రులు, కుటుంబీకులు కొంతమంది సిబ్బంది లోపలకు వెళ్లి చిన్నారులను ఒక్కొక్కరినీ బయటకు తీసుకొచ్చారు. అప్పటికే చిన్నారులు తీవ్ర అస్వస్థతకు



గురికావడంతో తల్లిదండ్రుల రోదనలు, చిన్నారుల ఏడుపులతో ఆ వార్డు దద్దరిల్లింది. మిగతా వార్డుల్ల చికిత్స పొందుతున్న రోగుల సహాయకులు, వైద్య సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. కొంతమంది సిబ్బంది తమ ప్రాణాలకు తెగించి నవజాత శిశువులను కాపాడారు. అయినప్పటికీ ఓ శిశువు పొగతో ఊపిరాడక ప్రాణం కోల్పోయింది. ప్రమాద తీవ్రత పెరగకుండా ఆ వార్డులో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. దీంతో ఇంక్యుబేటర్లు పనిచేయడం ఆగిపోయాయి. వెంటిలేటర్లపై ఉన్న నలుగురు చిన్నారులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. విషయం తెలుసుకున్న వెంటనే అర్ధరాత్రి కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్ రిమ్స్‌కు చేరుకుని సంఘటనకు సంబంధించి వివరాలు తెలుసుకున్నారు. చిన్నారులను జిల్లా కేంద్రంలోని ప్రయివేటు చిల్డ్రన్ ఆస్పత్రులకు తరలించారు.


**కండ్లు తెరవక ముందే ఆగిన ఊపిరి**

ఇచ్చోడ మండల కేంద్రంలోని సుభాష్‌నగర్‌కు చెందిన సలీంఖాన్(ఫీర్‌ఖాన్)-సబానాఖాన్‌కు శుక్రవారం పాప జన్మించింది. ఏడు నెలలకే పాప జన్మించడంతో ఎస్ఎన్‌సీయూలో ఉంచారు. షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించడంతో ఊపిరాడక చిన్నారి మృతి చెందింది. ఇంద్రవెల్లి మండలంలోని గిన్నెరకు చెందిన షేకుబాయి-కుమ్ర దినేష్ దంపతులకు రెండో సంతానంగా ఆడబిడ్డ జన్మించింది. ఎనిమిది నెలలకే బిడ్డ పుట్టడంతో ఎస్ఎన్‌సీయూలో ఉంచారు. పొగ వల్ల అస్వస్థతకు గురైన చిన్నారిని ప్రయివేటు ఆస్పత్రికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. ఉట్నూర్ మండల కేంద్రానికి చెందిన సబా సమ్రిన్-తౌఫిక్ దంపతులకు రెండో సంతానంగా ఆడబిడ్డ జన్మించింది. బరువు 1100 గ్రాములే ఉండటంతో ఎస్ఎన్‌సీయూలో ఉంచారు. పొగతో ఊపిరాడక చిన్నారి అస్వస్థతకు గురైంది. మొదట జిల్లా కేంద్రంలోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించగా, మెరుగైన వైద్యం కోసం నిర్మల్, అక్కడి నుంచి నిజామాబాద్‌కు తరలించారు. అక్కడికి చేరుకునే సమయంలోనే చిన్నారి మృతిచెందింది.

# 4 జిల్లాలకు వరదముప్పు

**మొదటిపేజీ తరువాయి**

కుంభవృష్టితో ఆకస్మిక వరదలు ముంచెత్తే ప్రమాదం ఉందని తెలిపింది. తీవ్ర వేగంతో గాలులు వీస్తాయని.. చెట్లు, హోర్డింగ్‌లు నేలకొరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది.తీవ్ర వాయుగుండం విశాఖపట్నానికి తూర్పుగా 220 కి.మీ., కళింగపట్నానికి తూర్పు ఆగ్నేయంగా 140 కి.మీ, గోపాలపూర్‌కు దక్షిణ ఆగ్నేయంగా 150 కి.మీ



దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఇది పశ్చిమ వాయువ్యంగా పయనించి బుధవారం రాత్రికి విశాఖపట్నం-గోపాల్‌పూర్‌కు మధ్య తీరం దాటనున్నదని విశాఖ తుఫాన్ హెచ్చరిక కేంద్రం తెలిపింది. కాగా, తీవ్ర వాయుగుండం తుఫాన్‌గా బలపడే అవకాశం లేదని ఐఎండీ అధికారులు స్పష్టంచేయగా, కొందరు వాతావరణ నిపుణులు మాత్రం ఒక మోస్తరు తుఫాన్‌గా మారుతుందని అంచనా వేస్తున్నారు.

అనుక్షణం ప్రజల పక్షం RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక
బుధవారం 23 సెప్టెంబర్ 2026

## జర్నలిస్టుల జేఏసీ జిల్లా అధ్యక్షుడిగా తక్కలపల్లి శ్రీనివాస్



**మహబూబాబాద్/సెప్టెంబర్ 22 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ జర్నలిస్టుల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడిగా తక్కలపల్లి శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు తొగరి కరుణాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల గణేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం జేఏసీ చేపట్టే కార్యక్రమాలను జిల్లా స్థాయిలో సమన్వయం చేసే బాధ్యతను శ్రీనివాస్‌కు అప్పగించినట్లు పేర్కొన్నారు. సంస్థ నియమ నిబంధనలు, క్రమశిక్షణకు ప్రాధాన్యమిస్తూ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర నాయకత్వం సూచించింది. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర కమిటీకి తక్కలపల్లి శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని జర్నలిస్టుల సమస్యలను రాష్ట్ర కమిటీ దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

## బాలికా భద్రతపై అవగాహన



**కేసముద్రం/సెప్టెంబర్ 22 (జర్నలిస్ట్ వార్త):** కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికా సాధికారత, కౌమార భద్రతా క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్, వైద్యురాలు డాక్టర్ అల్లం రమ నాగేశ్వర్ రావు హాజరై మాట్లాడారు. కౌమార దశలో వచ్చే శారీరక, మానసిక మార్పులపై బాలికలు అవగాహన పెంచుకోవాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణతో పాటు మంచి స్పర్శ, చెడు స్పర్శను గుర్తించి అప్రమత్తంగా ఉండాలని, స్వయం రక్షణపై చైతన్యం పెంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జి. శ్రీనివాస్, క్లబ్ మెంటార్ కృష్ణవేణి, ఉపాధ్యాయులు నరసింహారెడ్డి, సదయ్య, సత్యనారాయణ, లక్ష్మీకుమారి తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ బలమే మన బలం

**ఎన్నికలు ఏవైనా కాంగ్రెస్ జెండానే ఎగరాలి -కడియం శ్రీహరి ఘాటు పిలుపు**



**స్టేషన్ ఘన్‌పూర్/సెప్టెంబర్ 22 (జర్నలిస్ట్ వార్త):** సంస్థాగత నిర్మాణం పటిష్టంగా ఉంటేనే పార్టీ బలపడుతుందని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఎన్నికలు ఏవైనా స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండానే ఎగరాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. గ్రామస్థాయి నుంచి పార్టీని పటిష్టం చేయడమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. స్టేషన్ ఘన్‌పూర్‌లోని ఎస్ కన్వెన్షన్‌లో మండల, గ్రామ, అనుబంధ కమిటీల పరిచయ కార్యక్రమం నిర్వహించారు. కొత్తగా ఎన్నికైన కమిటీ సభ్యులు, గ్రామ అధ్యక్షులను కడియం శ్రీహరి సన్మానించారు. అనంతరం 24 మంది ముఖ్యమంత్రి సహాయ నిధి లబ్ధిదారులకు రూ. 14.28 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త, పాత అనే తేడాలు పక్కనపెట్టి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. కాంగ్రెస్‌తో కలిసి నడిచే వారందరినీ పార్టీలోకి ఆహ్వానించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. దేశంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో పాటు రాహుల్ గాంధీ ప్రధాని కావాలన్న లక్ష్యంతో పనిచేయాలని, రాష్ట్రంలో మరోసారి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేలా క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని అన్నారు.



## చైతన్య యూత్ ఆధ్వర్యంలో మహా అన్నదానం



**స్టేషన్ ఘన్‌పూర్/ సెప్టెంబర్ 22 (జర్నలిస్ట్ వార్త) :** మండలంలోని కొత్తపల్లి గ్రామంలో చైతన్య యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి ముందు మహా అన్నదానం కార్యక్రమం నిర్వహిం చారు. గ్రామంలోని చైతన్య యూత్ ఆధ్వర్యంలో బస్టాండ్ దగ్గర గత 14 సంవత్సరాల నుంచి వినాయక విగ్రహం పెట్టి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సంవత్సరం 15 వ సారి కూడా చైతన్య యూత్ ఆధ్వర్యంలో గణేష్ దేవుని పండుగను ఘనంగాజరిపిస్తున్నారు. సోమవారం చైతన్య యూత్ ఆధ్వర్యంలో వినాయకుడి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం దాతల సహకారంతో మహాఅన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ మన గ్రామంలో ఉన్నటువంటి చాలామంది పెద్దవాళ్లు బయటి దేశాలలో ఉన్న వాళ్లు మనగ్రామంలో ఉన్నటువంటివాళ్లు అందరి సహాయ సహకారాలతో చైతన్య యూత్ ఆధ్వ ర్యంలో గణేష్ దేవుని దగ్గర మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గణేష్ దేవుని మండపం సభ్యులు మరబోయిన దశరథ, ముక్కెర యాకరాజు, చెవుల రాకేష్, పులిగిల్ల రవీందర్, బూరు ప్రవీణ్ కుమార్, మరబోయిన యాకరాజు, రొయ్యల సంపత్,బూరు శేఖర్,మరబోయిన రమేష్,బూరు గణేష్, వెలకంటి మహేష్, గట్టు అశోక్, చల్లోజు రామచంద్ర చారి, బూరు మధుకర్, రంగు రమేష్, వడ్లకొండ రమేష్ తదరదులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌కు సర్పంచుల షాక్

**కడియం సమక్షంలో కాంగ్రెస్‌లోకి భారీ చేరికలు**



**స్టేషన్‌ఘన్‌పూర్/సెప్టెంబర్ 22 (జర్నలిస్ట్ వార్త):** రఘునాథపల్లి మండలంలో బీఆర్ఎస్‌కు చెందిన ఇద్దరు సర్పంచులతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఎమ్మెల్యే కడియం శ్రీహరి సమక్షంలో మేకలగట్టు సర్పంచ్ ఇల్లందుల రవి, గోవర్ధనగిరి సర్పంచ్ తోటకూర సదానందం, వార్డు సభ్యులు, నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నారుమేకలగట్టు నుంచి సుమారు 50 మంది, గోవర్ధనగిరి నుంచి మరో 30 మంది కాంగ్రెస్‌లో చేరినట్లు తెలిపారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి కండువాలు కప్పి స్వాగతించారు. నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరికలు జరుగుతున్నాయని కడియం శ్రీహరి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె మహేందర్‌రెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు

# వాటా కోసం సమరశంఖం

**27న హనుమకొండలో బహిరంగ పంచాయతీ**






**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరోసెప్టెంబర్ 22 (జర్నలిస్ట్ వార్త):** హక్కుల సాధన లక్ష్యంగా హనుమకొండ జిల్లా బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 27న హనుమకొండ హంటర్‌రోడ్‌లోని డీ కన్వెన్షన్ హాల్లో నిర్వహించనున్న 'ఎవరి కులం ఎంతో వారికంత వాటా' బహిరంగ పంచాయతీ సభకు ధర్మసాగర్ మండల అధికారులను జేఏసీ నాయకులు ఆహ్వానించారు సీఐ శ్రీనివాస్ తహసీల్దార్ బా వ్ సింగ్ వ్యవసాయ అధికారి రాజేష్ మండల ఆరోగ్య కేంద్రం అధికారులను కలిసి సభకు హాజరై విజయవంతం చేయాలని కోరారు బీసీ ఎస్సీ ఎస్టీలకు జనాభా ప్రాతిపదికన న్యాయమైన వాటా దక్కాలనే డిమాండ్‌తో ఈ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారుకార్యక్రమంలో ధర్మసాగర్ మండల అధ్యక్షుడు గంగారపు ఎల్లస్వామి మహారాజ్ మాదాసి కుమారస్వామి మండల బాధ్యులు ఎడ్ల రాజు పాశం విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు

## కాంగ్రెస్ పట్టణ అధికార ప్రతినిధిగా పోశాల కృష్ణమూర్తి

**పార్టీ బలోపేతమే లక్ష్యం.. ప్రజల్లోకి సంక్షేమ పథకాలు**



**స్టేషన్ ఘన్‌పూర్/సెప్టెంబర్ 22 (జర్నలిస్ట్ వార్త):** స్టేషన్ ఘన్‌పూర్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా శివునిపల్లికి చెందిన పోశాల కృష్ణమూర్తిని నియమించారు. పట్టణ అధ్యక్షుడు అంబాటి కిషన్‌రాజ్ ఈ నియామకాన్ని ప్రకటించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన కృష్ణమూర్తిని ఎమ్మెల్యే కడియం శ్రీహరి కండువా కప్పి సన్మానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని కృష్ణమూర్తి తెలిపారు. తనకు బాధ్యత అప్పగించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కడియం కావ్య, పార్టీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

# రాత్రి దోమల భయం.. పొద్దుగాల కోతుల బెడద!

## ఫాగింగ్.. బ్లీచింగ్ జాడేది?

**ఎల్కతుర్తి/సెప్టెంబర్ 22 (జర్నలిస్ట్ వార్త):** ఎల్కతుర్తి మండలంలోని పలు గ్రామాల్లో దోమల బెడద పెరుగుతున్నా నివారణ చర్యలు అంతంతమాత్రంగానే ఉన్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మురుగు కాలువలు, నిల్వ నీరు, చెత్తకుప్పలతో దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారుతున్నాయని గ్రామస్థులు వాపోతున్నారు. గతంలో చేపట్టిన ఫాగింగ్, బ్లీచింగ్ పౌడర్ చల్లే కార్యక్రమాలు ప్రస్తుతం కనిపించడం లేదని చెబుతున్నారు.

**వ్యాధుల భయం**

వర్షాలతో కాలువలు, లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోవడంతో దోమల సంఖ్య పెరుగుతోందని ప్రజలు అంటున్నారు. డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల భయంతో చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంటున్నారు. కొన్ని చోట్ల మురుగు నీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతోందని తెలిపారు.

**పారిశుద్ధ్యంపై దృష్టేదీ?**

గ్రామాల్లో మురుగు కాలువలను శుభ్రం చేయడం, నిల్వ నీటిని తొలగించడం, అవసరమైన ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లడం వంటి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. దోమల నియంత్రణకు ఫాగింగ్ నిర్వహించి, పారిశుద్ధ్య పనులను నిరంతరం పర్యవేక్షించాలని డిమాండ్ చేస్తున్నారు.

**కోతుల బెడదతోనూ ఇబ్బందులు**





దోమల సమస్యకు తోడు పలు గ్రామాల్లో కోతుల బెడద కూడా తీవ్రంగా ఉందని ప్రజలు చెబుతున్నారు. ఇళ్ల పరిసరాలు, పంట పొలాల్లో సంచరిస్తూ పంటలకు నష్టం కలిగిస్తున్నాయని రైతులు వాపోతున్నారు. సంబంధిత శాఖల అధికారులు స్పందించి కోతుల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**అధికారుల స్పందన కోసం ఎదురుచూపు**

గ్రామాల్లో పారిశుద్ధ్య పరిస్థితులపై పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. దోమలు, కోతుల బెడదపై సమగ్ర కార్యాచరణ చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# రైతు సంక్షేమమే ధ్యేయం



**వర్ధన్నపేట/సెప్టెంబరు 22(జర్నలిస్ట్ వార్త):** పీఏసీఎస్ నూతన డైరెక్టర్లు రైతు సంక్షేమమే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు సూచించారు. క్యాంపు కార్యాలయంలో నూతన డైరెక్టర్లను సన్మానించి నియామక పత్రాలు అందజేశారు. రైతులకు సకాలంలో రుణాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ల, కాంగ్రెస్ నాయకులు, పీఏసీఎస్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా చైతన్య యూత్ మహా అన్నదానం

## 15వ ఏట అడుగుపెట్టిన గణేష్ ఉత్సవాలు -దాతల సహకారంతో భక్తులకు అన్నప్రసాదం

**స్టేషన్ ఘన్‌పూర్/సెప్టెంబర్ 22 (జర్నలిస్ట్ వార్త):** వినాయకుడి సేవలో చైతన్య యూత్ మరోసారి సేవా స్ఫూర్తిని చాటింది. స్టేషన్ ఘన్‌పూర్ మండలం కొత్తపల్లి గ్రామంలో చైతన్య యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద సోమవారం మహా అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు.

గ్రామ బస్టాండ్ సమీపంలో చైతన్య యూత్ ఆధ్వర్యంలో 14 ఏళ్లుగా నిరంతరంగా గణేష్ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది 15వసారి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. గ్రామానికి చెందిన పెద్దలు, స్థానికులు, విదేశాల్లో ఉంటున్న గ్రామస్థుల సహకారంతో మహా అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఏళ్లుగా కొనసాగుతున్న గణేష్ ఉత్సవాలను మరింత ఘనంగా నిర్వహించడంతో పాటు భక్తులకు సేవ చేయడమే లక్ష్యంగా కార్యక్రమాలు చేపడుతున్నామని చైతన్య యూత్ సభ్యులు తెలిపారు.



కార్యక్రమంలో గణేష్ మండపం సభ్యులు మరబోయిన దశరథ, ముక్కెర యాకరాజు, చెవుల రాకేష్, పులిగిల్ల రవీందర్, బూరు ప్రవీణ్‌కుమార్, మరబోయిన యాకరాజు, రొయ్యల సంపత్, బూరు శేఖర్, మరబోయిన రమేష్, బూరు గణేష్, వెలకంటి మహేష్, గట్టు అశోక్, చల్లోజు రామచంద్రాచారి, బూరు మధుకర్, రంగు రమేష్, వడ్లకొండ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# కల్లు గీత కార్మికులకు పెన్షన్లు మంజూరు చేయాలి

## సెప్టెంబరు 25 గడువును అక్టోబరు 1 వరకు పొడిగించాలి

## తెలంగాణ గౌడ సంక్షేమ సంఘం డిమాండ్



**మహబూబాబాద్/సెప్టెంబర్ 22 (జర్నలిస్ట్ వార్త):** కల్లు గీత కార్మికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పెన్షన్లు మంజూరు చేయాలని తెలంగాణ గౌడ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు గండి వీరేందర్ గౌడ్ ఒక ప్రకటనలో కోరారు.రాష్ట్రంలోని పలు గ్రామాల్లో మండల ఎక్సైజ్ అధికారులు, పంచాయతీ కార్యదర్శుల ద్వారా గీత కార్మికులు పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకుంటున్నారని తెలిపారు. పలుచోట్ల అధికారుల నుంచి సరైన స్పందన లేకపోవడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క స్పందించి అర్హులైన ప్రతి గీత కార్మికుడికి పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. సాంకేతిక కారణాలతో దరఖాస్తులను తిరస్కరించకుండా అర్హులందరికీ అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.ప్రస్తుతం ఉన్న సెప్టెంబరు 25 గడువును గీత కార్మికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అక్టోబరు 1 వరకు పొడిగించాలని కోరారు. పెన్షన్ గీత కార్మికుల హక్కు, గౌరవప్రదమైన జీవనానికి ఆధారమని వీరేందర్ గౌడ్ పేర్కొన్నారు.

# స్మగ్లర్ల గుప్పిట్లో అటవీశాఖ?

## అక్రమ కలప రవాణాపై అధికారుల తీరుపై విమర్శలు -వన్యప్రాణుల వేటపైనా చర్యలు శూన్యమంటున్న స్థానికులు





**కల్లూరు/సెప్టెంబర్ 22 (జర్నలిస్ట్ వార్త):** అడవులను, అటవీ సంపదను కాపాడాల్సిన అటవీశాఖపై అవినీతి, అక్రమాలకు వత్తాసు పలుకుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమ కలప రవాణా, వన్యప్రాణుల వేట వంటి ఘటనలు జరుగుతున్నా అధికారులు తగిన స్థాయిలో స్పందించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో 'కంచే చేను మేస్తే కాపాడేది ఎవరు?' అని వారు ప్రశ్నిస్తున్నారు.

**'టన్నుకు ఎంత?' అంటూ ఆరోపణలు**

కింది స్థాయి సిబ్బంది నుంచి ఉన్నతాధికారుల వరకు కొందరు అక్రమ రవాణాదారులతో కుమ్మక్కవుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కలప అక్రమ రవాణాలో టన్నుల లెక్కన మామూళ్లు వసూలు చేస్తున్నారనే విమర్శలు ఉన్నప్పటికీ, దీనిపై అధికారికంగా ఎలాంటి నిర్ధారణ లేదు. అక్రమాలను అడ్డుకోవాల్సిన సిబ్బందే చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు అంటున్నారు.

**వన్యప్రాణుల వేటపై ఆందోళన**

లక్ష్మీపురం, రాళ్లబంజరు పరిసర ప్రాంతాల్లో వన్యప్రాణుల వేటకు సంబంధించిన ఘటనలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఇటీవల కనుజు వన్యప్రాణి హతమైన ఘటనపైనా సమగ్ర విచారణ జరపాలని వారు కోరుతున్నారు. వేటగాళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

**అక్రమ కలప రవాణాపై చర్యలేవీ?**

విలువైన కలపను పగటిపూటే తరలిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అక్రమ రవాణాపై అరకొర జరిమానాలతో సరిపెడుతున్నారనే విమర్శలు కూడా ఉన్నాయి. ఈ ఆరోపణలపై అటవీశాఖ ఉన్నతాధికారులు స్పందించి వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఉంది. అటవీ సంపద పరిరక్షణలో నిర్లక్ష్యం చోటుచేసుకుంటే పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉంది. అక్రమ కలప రవాణా, వన్యప్రాణుల వేటపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులు ఎవరైనా ఉంటే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# తండ్రి ఆశయ సాధనే లక్ష్యం

## కళాకారులకు టీషర్టుల పంపిణీ



**తల్లాడ/సెప్టెంబర్ 22 (జర్నలిస్ట్ వార్త):** దివంగత సీనియర్ రాజకీయ నాయకుడు జక్కంపూడి కృష్ణమూర్తి, ప్రేమలత జ్ఞాపకార్థం వారి తనయుడు, కాంగ్రెస్ మండల నాయకుడు జక్కంపూడి కిషోర్ ఆధ్వర్యంలో మంగళవారం డప్పు కళాకారులకు టీషర్టులు పంపిణీ చేశారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గొడుగునూరి లక్ష్మారెడ్డితో కలిసి కార్యక్రమాన్ని నిర్వహించారుతండ్రి జక్కంపూడి కృష్ణమూర్తి ఆశయాలను కొనసాగించడమే తన లక్ష్యమని కిషోర్ తెలిపారు. ఆయన పేరుతో ప్రజాసేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తానన్నారు. గతంలో బిల్లుపాడు గ్రామ ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం కార్పొరేట్ ఆసుపత్రుల సహకారంతో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించినట్లు తెలిపారు. భవిష్యత్తులో తల్లాడ మండల వ్యాప్తంగా మరిన్ని విస్తృత సేవా కార్యక్రమాలు చేపడతామని చెప్పారుకార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గోవింద్ శ్రీనివాసరావు, ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు కోసూరు వెంకటేశ్వరరావు, సొసైటీ చైర్మన్ దిరిశాల నరసింహారావు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు దుండేటి వీరారెడ్డి, పగడాల అచ్చిరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మారెళ్ల మల్లికార్జునరావు, మండల ఉపాధ్యక్షుడు తాళ్ల జోసెఫ్, కళాకారుల బృందం అధ్యక్షుడు కాంపల్లి వంశీ, రావుల గోపి గౌడ్‌తో పాటు పలువురు సర్పంచులు, ఉపసర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కళాకారులు పాల్గొన్నారు

# నిమజ్జన ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి



**కేసముద్రం/సెప్టెంబర్ 22 (జర్నలిస్ట్ వార్త):** గణేష్ నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ముందస్తు ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, ఎస్సై క్రాంతికిరణ్, బానోత్ వెంకన్న నాయక్ సూచించారు. మంగళవారం కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని విలేజ్, అమీనాపురం, ధన్నసరి, కేసముద్రం స్టేషన్ పెద్దచెరువు ప్రాంతాల్లో నిమజ్జన ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.నిమజ్జన ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణ, భద్రత, పారిశుధ్యం, విద్యుత్ సౌకర్యాలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. నిమజ్జన కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో సజావుగా పూర్తయ్యేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బీ డీఈ శ్రీకాంత్, తహసీల్దార్ వివేక్, అంబటి మహేందర్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్లు తరాల వీరేష్‌యాదవ్, దారావత్ కిషోర్, పైరాల శరత్, పురం రమేష్, మహేందర్, పోలీస్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# టీఎల్ఎంతో సులభంగా బోధించాలి

## ఎంఈఓ కాలేరు యాదగిరి

**కేసముద్రం/సెప్టెంబర్ 22 (జర్నలిస్ట్ వార్త):** ఉపాధ్యాయులు బోధనలో బోధనాభ్యసన సామగ్రి (టీఎల్ఎం)ను వినియోగిస్తూ విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా పాఠాలు బోధించాలని కేసముద్రం మండల విద్యాశాఖ అధికారి కాలేరు యాదగిరి అన్నారు. మంగళవారం తాళ్లపూసపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు కోట కనకయ్య అధ్యక్షతన నిర్వహించిన పాఠశాల సముదాయ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ఉపాధ్యాయులు వృత్తి ధర్మాన్ని కాపాడుతూ అంకితభావంతో పనిచేసి విద్యార్థులను తీర్చిదిద్దాలని సూచించారు. జిల్లా కలెక్టర్, ఎల్టా బృందం రూపొందించిన లెర్న్ ఇంగ్లీష్ త్రూ యాక్టివ్



పార్టిసిపేషన్ పుస్తకాన్ని పాఠశాలల్లో ప్రతిరోజూ వినియోగించి విద్యార్థుల్లో ఆంగ్ల భాషా సామర్థ్యాలను పెంపొందించాలని కోరారు. అన్ని తరగతుల విద్యార్థులు ఆయా సబ్జెక్టుల్లో కనీస సామర్థ్యాలు సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

ప్రధానోపాధ్యాయుడు కోట కనకయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయులు పనిని భారంగా కాకుండా బాధ్యతగా భావించి విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాలని అన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని పాఠశాల సముదాయ సహాయ కార్యదర్శి గోపాల శ్రీధర్ సూచించారు.

అకడమిక్ ప్యానల్ తనిఖీ బృందం సభ్యులు సారంగం ఉపాధ్యాయులకు లీప్ పాఠ్యాంశం ఆవశ్యకతను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉపయోగపడేలా ఉపాధ్యాయులు రూపొందించిన ఆకర్షణీయమైన టీఎల్ఎంలను ఎంఈఓ కాలేరు యాదగిరి, ప్రధానోపాధ్యాయుడు కోట కనకయ్య పరిశీలించి అభినందించారు. ఆర్పీలు ఈ.భాస్కర్, వై.అశోక్, సీఆర్పీ నేరెళ్ల పద్మతో పాటు వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పీఏసీఎస్ చైర్మన్‌కు సన్మానం



**వర్ధన్నపేట/సెప్టెంబరు 21(జర్నలిస్ట్ వార్త);** వర్ధన్నపేట మండల పీఏసీఎస్ నూతన చైర్మన్‌గా నియమితులైన అబ్బిడి రాజిరెడ్డి, డైరెక్టర్లను ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజు సోమవారం హనుమకొండలోని తన క్యాంపు కార్యాలయంలో శాలువాలతో సన్మానించి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. రైతులకు పీఏసీఎస్ సేవలు అందుబాటులో ఉండేలా, ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పోశాల వెంకన్నగౌడ్, ఏఎంసీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి, టౌన్ అధ్యక్షుడు ఈగ దామోదర్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రతి బానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# గణనాథుడిసేవలో మంత్రి పొంగులేటి!

## తల్లాడలో భక్తిభావం.. -భక్తిశ్రద్ధలతో గణనాథుడికి ప్రత్యేక పూజలు

**తల్లాడ/సెప్టెంబర్ 22 (జర్నలిస్ట్ వార్త):** తల్లాడ పట్టణంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు భక్తిభావంతో కొనసాగుతున్నాయి. వాసవి కన్యకా పరమేశ్వరి కన్వెన్షన్ హాల్‌లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథుడిని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర సీనియర్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ మంగళవారం దర్శించుకున్నారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి హారతులు సమర్పించారు.

**ప్రశాంతంగా నిమజ్జనం నిర్వహించాలి**

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ



తొమ్మిది రోజులుగా భక్తిశ్రద్ధలతో నిర్వహించిన గణేష్ నవరాత్రి ఉత్సవాలను అదే స్ఫూర్తితో విజయవంతంగా ముగించాలని కోరారు. నిమజ్జన వేడుకలను ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని సూచించారు. భక్తులు, నిర్వాహకులు పరస్పర సమన్వయంతో నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తల్లాడ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గొడుగునూరు లక్ష్మారెడ్డి, ఆర్యవైశ్య సంఘం ప్రముఖులు నంబూరు మోహన్‌రావు, వేమిశెట్టి నాగన్న, జవ్వాజి సుబ్బారావు, జవ్వాజి నరసింహారావు, దార విష్ణు మోహన్‌రావు, కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో గణేష్ నవరాత్రి ఉత్సవాలు

## పలు మండపాల్లో గణనాథుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



**మిర్యాలగూడ/సెప్టెంబర్ 22 (జర్నలిస్ట్ వార్త):**
మిర్యాలగూడ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో గణేష్ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజు వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన శ్రీ గణనాథుల విగ్రహాలను మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్ఆర్) దర్శించుకున్నారు.
ఈ సందర్భంగా ఆయా గణేష్ మండపాల్లో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ నిర్వాహకులు, భక్తులతో మాట్లాడి వేడుకల నిర్వహణ తీరును అడిగి తెలుసుకున్నారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలు భక్తి, శాంతి, సోదరభావంతో కొనసాగాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ప్రజలందరిపై శ్రీ గణేశుడి ఆశీస్సులు ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, సర్పంచులు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారి వైద్యానికి విద్యార్థుల చేయూత

## మిరాకిల్ మైండ్స్ విద్యార్థుల నుంచి రూ.40 వేల ఆర్థిక సాయం




**సత్తుపల్లి/సెప్టెంబర్ 22 (జర్నలిస్ట్ వార్త):**
మానవత్వం, సేవాభావం, సామాజిక బాధ్యతను విద్యార్థుల్లో పెంపొందించాలనే లక్ష్యంతో మిరాకిల్ మైండ్స్‌ది స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ విద్యార్థులు సేవా కార్యక్రమం చేపట్టారు. రక్త క్యాన్సర్‌తో బాధపడుతున్న చార్లెస్ ఫిన్నీ అనే చిన్నారి వైద్య ఖర్చుల కోసం రూ.40 వేల ఆర్థిక సాయం అందించారు.
విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారంతో సేకరించిన మొత్తాన్ని చిన్నారి కుటుంబానికి అందజేశారు. ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడం ద్వారా విద్యార్థులు మానవత్వాన్ని చాటుకున్నారు. పుస్తకాల్లోని విషయాలను నేర్చుకోవడంతో పాటు అవసరంలో ఉన్నవారికి చేయూతనివ్వడం కూడా విద్యలో భాగమేనని విద్యార్థులు తమ సేవా కార్యక్రమం ద్వారా చాటిచెప్పారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.
విద్యార్థుల్లో దయ, మానవత్వం, సామాజిక బాధ్యత, సేవాభావం వంటి విలువలను పెంపొందించేలా భవిష్యత్తులోనూ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని ప్రిన్సిపాల్ రత్నాకర్ మొంగ్రు తెలిపారు.

# జగ్గుతండ గిరిజన సంక్షేమ హాస్టల్‌లో హెల్త్ క్యాంప్.

## -విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాల పంపిణీ.



**బయ్యారం/సెప్టెంబర్ 22.(జర్నలిస్ట్ వార్త);** బయ్యారం మండలం జగ్గుతండ గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ హాస్టల్‌లో మంగళవారం విద్యార్థుల కోసం మండల వైద్యాధికారి డాక్టర్ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఉచిత హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ బొల్లి జయంతి వెంకటకృష్ణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వర్షాకాలం, చలికాలంలో సంభవించే సీజనల్ వ్యాధుల బారిన పడకుండా విద్యార్థులు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై మండల వైద్యాధికారి డాక్టర్ విజయ్ కుమార్, సర్పంచ్ బొల్లి జయంతి వెంకటకృష్ణలు విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన సూచనలు అందించారు. ప్రభుత్వం నుంచి విద్యార్థులకు మంజూరైన స్కూల్ బ్యాగులు, షూస్, నోట్ పుస్తకాలను సర్పంచ్, డాక్టర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని సర్పంచ్, వైద్యాధికారి విద్యార్థులతో కలిసి ఆరారించి, భోజనం నాణ్యతను, రుచిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సిఎస్ఓ బుగ్గ రామయ్య, హాస్టల్ వార్డెన్ నర్సింగ తిరుమలరావు, హాస్టల్ ఏఎన్ఎం పార్వతి, జగ్గుతండ పంచాయతీ ఏఎన్ఎం సమ్మక్క, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఏదులాపురం ఇంటిగ్రేటెడ్ భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయండి

## నాణ్యతలో రాజీ వద్దు మంత్రి పొంగులేటి

**ఖమ్మం/సెప్టెంబర్ 22 (జర్నలిస్ట్ వార్త):**
ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న ఇంటిగ్రేటెడ్ కార్యాలయాల భవన నిర్మాణ పనులను రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వరంగల్ క్రాస్‌రోడ్డులోని తరుణీ హట్ ప్రాంగణంలో జరుగుతున్న పనులను పరిశీలించిన మంత్రి. నిర్మాణ నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడొద్దని అధికారులను ఆదేశించారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.



ఇంటిగ్రేటెడ్ కార్యాలయాల భవన సముదాయం అందుబాటులోకి వస్తే ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని వివిధ ప్రభుత్వ శాఖల సేవలు ఒకే చోట లభిస్తాయని, దీనివల్ల ప్రజలకు ఎంతో సౌకర్యం కలుగుతుందని మంత్రి తెలిపారు.



ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, వైస్‌చైర్మన్ తమ్మినేని నవీన్, మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఖమ్మం రూరల్ మండల అధ్యక్షుడు తోట వీరభద్రం, పలువురు కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# జలగంనగర్‌లో వైభవంగా శ్రీ సాయి గణేష్ ఉత్సవాలు



**ఖమ్మం/ సెప్టెంబర్ 22 (జర్నలిస్ట్ వార్త);**
ఖమ్మం మున్సిపాలిటీ పరిధిలోని జలగంనగర్‌లో శ్రీ సాయి గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఐదో వార్షికోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి నల్లగట్టు అన్వేష్ సారథ్యంలో నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలకు గీస్కా కృష్ణ నాయక్ చీరాల వీరభద్రం గడ్డ వీరన్నలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు విగ్రహ ప్రదాత కుదురుపాక వెంకటేశ్వర్లు పద్మ దంపతులు వారి కుమారుడు పవన్ అందించిన సహకారంతో గణేష్ ఉత్సవాలను ప్రారంభించారుతొమ్మిది రోజులపాటు నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుంటున్నారు అన్నదాన కార్యక్రమాలు కుంకుమ పూజలు నిర్వహిస్తూ భక్తులకు ఆధ్యాత్మిక సేవలు అందిస్తున్నారు ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ ప్రజలంతా ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని శ్రీ గణేశుడిని వేడుకున్నట్లు తెలిపారు ఉత్సవ కమిటీకి బీఆర్ఎస్ పార్టీ తరఫున అన్ని విధాలా సహకారం అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నల్లగట్టు అన్వేష్ హుస్సేన్ బోయిన సాయి కార్పొరేటర్ బోయిన కుమారి సంగయ్య భరత్ సుమంత్ హర్ష నరేష్ రాంలక్ష్మణ్ అచ్యుత్ తదితరులు పాల్గొన్నారు జలగంనగర్ యూత్ సభ్యులు శ్రీ సాయి గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు సహకార దాతలు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# వినాయక నిమజ్జన ఘాట్లను పరిశీలించిన ఆర్డీవో రాజేశ్వరి.



**బయ్యారం/సెప్టెంబర్ 22.(జర్నలిస్ట్ వార్త);**
బయ్యారం మండలంలో నేటి నుంచి ప్రారంభమయ్యే వినాయక నిమజ్జనానికి సంబంధించి చేపట్టిన ఏర్పాట్లను మహబూబాబాద్ ఆర్డీవో, మండల స్పెషల్ ఆఫీసర్ రాజేశ్వరి మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మండల పరిధిలోని బయ్యారం అలిగేరు వాగు వద్ద ఏర్పాటు చేసిన పాయింట్‌ను, అలాగే కొత్తపేట నుంచి కోటగడ్డ వెళ్లే మార్గంలో ఉన్న బయ్యారం పెద్ద చెరువు అలిగేరు వద్ద ఏర్పాటు చేసిన నిమజ్జన ప్రాంతాన్ని ఆమె అధికారులతో కలిసి సందర్శించారు. నిమజ్జనం వేళ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, ప్రమాదాలు జరగకుండా ముందస్తు భద్రతా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి పలు సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ చప్పిడి నాగరాజు, ఎంపీడీవో దీపిక, స్థానిక ఎస్సై ప్రశాంత్ బాబు పాటు రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# రైతు గుర్తింపు సంఖ్య తప్పనిసరి

## 22 నుంచి 30 వరకు ప్రత్యేక నమోదు శిబిరాలు



**ఎల్కతుర్తి/సెప్టెంబర్ 22 (జర్నలిస్ట్ వార్త):**
ప్రభుత్వ వ్యవసాయ సంక్షేమ పథకాలు పొందేందుకు రైతులు తప్పనిసరిగా రైతు గుర్తింపు సంఖ్య (ఫార్మర్ రిజిస్ట్రీ) పొందాలని జిల్లా వ్యవసాయ అధికారి విజయ్‌చందర్ సూచించారు. ఎల్కతుర్తి రైతు వేదికలో నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమానికి రైతుల నుంచి స్పందన లభించింది. రైతు గుర్తింపు సంఖ్య కోసం ఏఈఓలు, మీ సేవ, కామన్ సర్వీస్ సెంటర్లలో పేర్లు నమోదు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. గుర్తింపు సంఖ్య ద్వారా యూరియా సరఫరాతో పాటు ప్రభుత్వం అందించే వివిధ వ్యవసాయ పథకాలు, సబ్సిడీలు, బోనస్‌లు, పంపుసెట్లు తదితర ప్రయోజనాలు పొందేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. రైతుల నమోదు కోసం ఈ నెల 22 నుంచి 30 వరకు గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.
ఈ సందర్భంగా సింగిల్‌విండో చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, తెలంగాణ రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు హింగే భాస్కర్‌ను వ్యవసాయ శాఖ అధికారులు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకులు ఆదిరెడ్డి, మండల వ్యవసాయ అధికారి మంద రాజకుమార్, వ్యవసాయ విస్తరణ అధికారులు పున్నం చందర్, బాబు, రైతులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శిగా కునూరు రాజు

## నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటా..

## పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి



**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరోసెప్టెంబర్ 22 (జర్నలిస్ట్ వార్త):**
హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా కునూరు రాజు ఎన్నికయ్యారు. పార్టీ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సమర్థంగా నిర్వర్తిస్తూ మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆయన తెలిపారు. తనను మండల ప్రధాన కార్యదర్శిగా ఎంపిక చేసిన స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఇనుగాల వెంకటరామిరెడ్డికి కునూరు రాజు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కార్యక్రమాలను గ్రామస్థాయికి తీసుకెళ్లడంతో పాటు నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. తన ఎన్నికకు సహకరించిన మండల పార్టీ అధ్యక్షుడు పెసర రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రపు ప్రసాద్‌తో పాటు మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# కాంగ్రెస్ బలోపేతానికి పుట్ట నవీన్‌కు కీలక బాధ్యతలు

## ధర్మసాగర్ మండల కార్యదర్శిగా నియామకం

## ఎమ్మెల్యే కడియం శ్రీహరి, నాయకత్వానికి కృతజ్ఞతలు



**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరోసెప్టెంబర్ 22 (జర్నలిస్ట్ వార్త):**
ధర్మసాగర్ మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా పుట్ట నవీన్‌కు కీలక బాధ్యతలు అప్పగించారు. మండల కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా నవీన్‌ను నియమించారు. పార్టీ నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ కార్యకర్తలను సమన్వయం చేసుకుని పార్టీ కార్యక్రమాలను గ్రామస్థాయిలో విస్తృతంగా ముందుకు తీసుకెళ్తానని ఆయన తెలిపారు. తన నియామకానికి సహకరించిన స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, మండల పార్టీ అధ్యక్షుడు పెసర రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు గుర్ర ప్రసాద్‌తో పాటు ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికీ పుట్ట నవీన్ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

# బయ్యారం పెద్ద చెరువు నీటి విడుదల కోసం రైతుల రాస్తారోకో..

**బయ్యారం/సెప్టెంబర్ 22.(జర్నలిస్ట్ వార్త);**
బయ్యారం పెద్ద చెరువు నుంచి సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన రాస్తారోకో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల తీరుపై మండిపడుతూ రైతులు, రైతు సంఘాల నాయకులు పెద్ద ఎత్తున రహదారిపై బైఠాయించి ఆందోళన నిర్వహించారు. తొలుత పంటలకు నీరు విడుదల చేస్తామని చెప్పి, ప్రస్తుతం అధికారులు ఆ మాటను విస్మరించడంపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుత పంటలకు, అపరాలకు నీటిని విడుదల చేస్తారా.? లేదా.? అంటూ ఇరిగేషన్ అధికారులు, ఎమ్మార్వోను నేరుగా నిలదీశారు. ఈ ఆందోళనపై ఇరిగేషన్ ఏఈ పృథ్వి స్పందిస్తూ... బయ్యారం పెద్ద చెరువు 'మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టు'గా



ఉందని, నీటి విడుదలపై ప్రభుత్వం, ఉన్నతాధికారుల నుంచి ఇప్పటివరకు తమకు ఎటువంటి సమాచారం రాలేదని తెలిపారు. రైతు ఆందోళనను పైస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి, రెండు రోజుల్లో స్పష్టమైన నిర్ణయం ప్రకటిస్తామని హామీ ఇచ్చారు. అయితే అధికారుల సమాధానంతో సంతృప్తి చెందని రైతు సంఘాల నాయకులు, రాబోయే 15 రోజుల్లోగా నీటిని విడుదల చేయకపోతే తమంతట తామే తూములు బద్దలు కొట్టి నీటిని పారించుకుంటామని కఠినంగా హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ సప్పిడి నాగరాజు, సీఐ రవీందర్, ఎస్ఐ ప్రశాంత్ బాబు, ఇరిగేషన్ ఏఈ పృథ్వి రైతుల నాయకులతో చర్చలు జరిపి నీటి విడుదలపై స్పష్టమైన హామీ ఇవ్వడంతో రైతులు తమ రాస్తారోకో ఆందోళనను విరమించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు తాత గణేష్, సిపిఎం పార్టీ మండల కార్యదర్శి నంబూరి మధు, ఏఐకేఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నందగిరి వెంకటేశ్వర్లు, బీజేపీ జిల్లా నాయకులు తుమ్మల శ్రీనివాస్ రావు, తిరుమల చంద్రారెడ్డి, ఏనుగుల ఐలయ్య, సూరం రవీందర్ రెడ్డి, కొండ్రెడ్డి సోమిరెడ్డి, కత్తి రమేష్, భూషయ్య, వల్లలా వెంకన్న, యరసంగి పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

# పసుపులేటి సురేష్ జ్ఞాపకార్థం గణేష్ మంటపం వద్ద అన్నదానం.

**బయ్యారం/,సెప్టెంబర్ 22:(జర్నలిస్ట్ వార్త)**
మండల కేంద్రంలోని గంగబజార్ ప్రాంతంలో స్వర్గీయ పసుపులేటి సురేష్ జ్ఞాపకార్థం గణేష్ ఉత్సవాల సందర్భంగా మంగళవారం ఘనంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సురేష్ కుమారుడు సిద్ధార్థ, మైత్రి వారి ఆధ్వర్యంలో మేడి వెంకన్న - సత్యవతి దంపతుల సహకారంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ అన్నదానంలో స్థానిక భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. పసుపులేటి సురేష్ జ్ఞాపకార్థం ప్రజలకు, భక్తులకు సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో సంతృప్తినిచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, యువకులు, కాలనీవాసులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# గర్భంలో బిడ్డ.. తల్లి దంతాలపై శ్రద్ధ!









**వర్ధన్నపేట/సెప్టెంబర్ 22(జర్నలిస్ట్ వార్త):** గర్భిణుల ఆరోగ్య పరిరక్షణలో దంత ఆరోగ్యానికీ ప్రాధాన్యం ఇవ్వాలని వైద్యులు సూచించారు. గర్భధారణ సమయంలో దంత సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు దంత పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. వర్ధన్నపేట సామాజిక వైద్యశాలలో గర్భిణులకు దంత పరీక్షలు నిర్వహించి, దంత సంరక్షణ, నోటి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా డీసీహెచ్ఎస్ జగదీష్ మాట్లాడుతూ గర్భిణులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, దంత సమస్యలు తలెత్తితే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. గర్భధారణ సమయంలో క్రమం తప్పకుండా వైద్య పరీక్షలతో పాటు దంత పరీక్షలు చేయించుకోవడం అవసరమన్నారు. దంత వైద్యులు డాక్టర్ భరత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతిరోజూ నోటి పరిశుభ్రత పాటించడం, దంతాలను శుభ్రంగా ఉంచుకోవడం, దంత సమస్యలను నిర్లక్ష్యం చేయకపోవడం ముఖ్యమన్నారు. సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ ఎం. సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు గర్భిణులకు ఏఎన్‌సీ పరీక్షల ప్రాధాన్యాన్ని వివరించారు. గర్భిణులు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకుని వైద్యుల సూచనలు పాటించాలని తెలిపారు.

# కొనారెడ్డి చెరువులో నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు





**వర్ధన్నపేట/సెప్టెంబర్ 22(జర్నలిస్ట్ వార్త):**
పట్టణంలోని కొనారెడ్డి చెరువు వద్ద వినాయక నిమజ్జనం ఏర్పాట్లను మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణితో కలిసి ఏసీపీ నర్సయ్య, విద్యుత్ శాఖ డీఈ దానయ్య పరిశీలించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా భద్రత, ట్రాఫిక్, పార్కింగ్, విద్యుత్, లైటింగ్, తాగునీరు, పారిశుధ్య ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. పోలీస్, మున్సిపల్ అధికారులు సమన్వయంతో పనిచేసి నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. భక్తులు అధికారుల సూచనలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐ సంజీవరావు, ఎస్ఐ సాయిబాబు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నీళ్లడిగితే రాజకీయం అంటారా?

**జూరాల కింద పంటలకు నీళ్లు ఇవ్వకుంటే**

**రైతులు నష్టపోరా?: రాంచందర్‌రావు**

**నీళ్లడిగితే రాజకీయం అంటారా?**



**జడ్చర్ల, సెప్టెంబరు 22 (జర్నలిస్ట్ వార్త);**
"నీళ్లు అడిగితే రాజకీయం అంటారా? జూరాల ప్రాజెక్టు కింద సాగుకు నీళ్లివ్వమంటే.. తాగునీటి కోసం దాచిపెడుతున్నామని అంటున్నారు. రాష్ట్రంలో అప్రజాస్వామిక ప్రభుత్వం నడుస్తోంది" అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు విమర్శించారు. జోగుళాంబ గద్వాల జిల్లాలోని జూరాల ప్రాజెక్టు వద్ద రైతులు చేపడుతున్న పోరాటానికి మద్దతుగా వెళ్తున్న తమను పోలీసులు అరెస్టు చేయడం సరికాదన్నారు. మంగళవారం జూరాల ప్రాజెక్టు వద్దకు వెళుతూ మహబూబ్‌నగర్ జిల్లా గొల్లపల్లిలోని ఓ హోటల్ వద్ద రాంచందర్‌రావుతో పాటు పలువురు బీజేపీ నేతలను పోలీసులు అరెస్టు చేసి జడ్చర్లలోని పోలీసు శిక్షణా కేంద్రానికి తరలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రం అంతా సమస్యల వలయంలో చిక్కుకుపోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. జూరాల ప్రాజుక్టు కింద సాగుచేసిన పంటలకు నీళ్లివ్వబోమనడం దుర్మార్గం అని మండిపడ్డారు. నీళ్లు లేకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఎగువన ఉన్న కర్ణాటకలోని నారాయణపూర్, ఆల్మట్టి ప్రాజెక్టులుల్లో 97.4 నీటి నిల్వ ఉన్నదని, అందులో 5 టీఎంసీల నీళ్లు వదిలితే ఇక్కడి పంటలకు ఇబ్బంది ఉండదని పేర్కొన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన వ్యక్తే ముఖ్యమంత్రిగా ఉన్నారని, జిల్లా రైతులను ఆదుకునే బాధ్యత ఆయనదేనన్నారు. కాగా, కృష్ణా, గోదావరి పరివాహక ప్రాంత ప్రాజెక్టుల్లో నీరున్నా పంటలు ఎండబెడతారా? అని కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ మండిపడ్డారు. ఇంత మూర్ఖపు ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూడలేదని దుయ్యబట్టారు.

# వైభవం దిశగా పురపాలికలు

**కుప్పం నుంచి వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం**

**రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 22,330 కోట్ల పనులు**



**కుప్పం/అమరావతి,సెప్టెంబర్ 22 (జర్నలిస్ట్ వార్త);**
రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు పట్టణాలే గ్రోత్ ఇంజన్లుగా మారుతున్నాయని సీఎం చంద్రబాబు అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రజాప్రతినిధులు, అధికారులు ఆ దిశగా కృషి చేయాలని సూచించారు. రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో రూ.11,359 కోట్ల విలువైన అభివృద్ధి పనులను మంగళవారం కుప్పం నుంచి ఆయన వర్చువల్‌గా ప్రారంభించారు. భారీ ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టి పురపాలక చరిత్రలో సువర్ణ అధ్యాయాన్ని లిఖించామని చెప్పారు. 'రెండేళ్లుగా సంక్లిష్ట పరిస్థితుల్ని అధిగమిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడిపిస్తున్నాం. పరిపాలనను తిరిగి గాడిలో పెట్టడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నాం. ఇవాళ పట్టణ ప్రాంతాల్లో రూ.11,359 కోట్ల విలువైన పనులకు శ్రీకారం చుట్టాం. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే రూ.22,330 కోట్ల పనులు కొనసాగుతున్నాయి. మరో 6నెలల్లో రూ.17వేల కోట్ల పనులు ప్రారంభిస్తాం. మొత్తం రూ.50 వేల కోట్ల విలువైన పనులు పూర్తయితే రాష్ట్రం దశ-దిశ మారతాయి' అని తెలిపారు. పట్టణాల్లో రోడ్లు, పార్కులు, సెంట్రల్ మీడియన్లు, సీవరేజీ పనులు చేపట్టాలని నిర్ణయించామన్నారు. రిజర్వాయర్ల ద్వారా నీటిని నిల్వ చేసే కార్యక్రమం కూడా చేపట్టినట్లు తెలిపారు. పెద్దఎత్తున అభివృద్ధి పనులను చేపట్టిన మంత్రి పి.నారాయణ, అధికారులను సీఎం అభినందించారు. పట్టణ స్థానిక సంస్థలపై ఆర్థిక భారం పడకుండా హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్ఏఎం)లో తొలిసారిగా భారీస్థాయిలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. '123 పట్టణ స్థానిక సంస్థల పరిధిలో రూ.7,469 కోట్లతో పనులు చేపడుతున్నాం. రోడ్ల నిర్మాణానికి 4,656 కోట్లు కేటాయించాం. 2,165 కి.మీ. రోడ్లను అభివృద్ధి చేస్తాం' అని అన్నారు. పట్టణాల అభివృద్ధిపై ప్రజాప్రతినిధులు, కమిషనర్లు శ్రద్ధ పెట్టాలన్నారు.పట్టణ ప్రాంతాల్లో మెరుగైన నివాస యోగ్యత ఉండాలని చంద్రబాబు అన్నారు. 'పట్టణాలను కాంక్రీట్ జంగిల్స్‌గా కాకుండా ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన ప్రాంతాలుగా తీర్చిదిద్దుతాం. 502 పార్కులు, 210 కిలోమీటర్ల సెంట్రల్ మీడియన్లు, 391 కిలోమీటర్ల స్ట్రీట్ లైటింగ్ పనులు చేపట్టబోతున్నాం. రోడ్లతో పాటు సీవరేజీ వ్యవస్థను కూడా అభివృద్ధి చేస్తాం. వీకెండ్ ఎకానమీ పెంచే దిశగా చర్యలు తీసుకోవాలి. ప్రజలు తమకు వచ్చే ఆదాయంలో 61 శాతం మొత్తాన్ని వారాంతాల్లో ఖర్చు చేస్తున్నారు. హౌసింగ్, రవాణా కోసం పట్టణ ప్రాంతాలవాళ్లు 71 శాతం ఖర్చు చేస్తున్నారు. అందుకే టిడ్కో గృహాలతో పాటు రవాణా కోసం స్త్రీశక్తి లాంటి కార్యక్రమాలు చేపట్టాం. 2027 నాటికి రాష్ట్రంలోని టిడ్కో గృహాలన్నీ పూర్తిచేస్తాం. 2047 నాటికి రాష్ట్రంలోని ప్రతి మున్సిపాలిటీని స్వర్ణ మున్సిపాలిటీగా తీర్చిదిద్దే లక్ష్యంతో పనిచేస్తున్నాం' అని తెలిపారు.

## బయ్యారంలో విగ్రహాల నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు.

**-బయ్యారం సర్పంచ్ శాంతి.**



**బయ్యారం/సెప్టెంబర్ 22.(జర్నలిస్ట్ వార్త);**
బయ్యారం మండల కేంద్రంలో నిర్వహించనున్న వినాయక నిమజ్జన మహోత్సవానికి సంబంధించి అన్ని రకాల ఏర్పాట్లను పూర్తి చేసినట్లు గ్రామ సర్పంచ్ శాంతి కిషన్ నాయక్ తెలిపారు. మంగళవారం అలిగేరు బ్రిడ్జి సమీపంలో వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం చేపడుతున్న ఏర్పాట్లను సర్పంచ్ శాంతి కిషన్ నాయక్,పంచాయతీ కార్యదర్శి రాంబాబు ఇతర ప్రజాప్రతినిధులు కలిసి స్వయంగా పరిశీలించారు.ఈ సందర్భంగా సర్పంచ్ శాంతి కిషన్ నాయక్ మాట్లాడుతూ గ్రామస్తులు, భక్తులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా అలిగేరు బ్రిడ్జి వద్ద ప్రత్యేక, భద్రతా చర్యలు స్వచ్ఛతా కార్యక్రమాలను చేపట్టినట్లు చెప్పారు. నిమజ్జనం ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, భక్తులందరూ అధికారులకు, గ్రామ పంచాయతీ సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# గ్రామస్తుల ఆరోగ్యం కోసం సర్పంచ్ సాహసోపేత నిర్ణయం.

**-వీధుల్లో దోమల మందు పిచికారీ చేసిన సర్పంచ్.**



**బయ్యారం/సెప్టెంబర్ 22.(జర్నలిస్ట్ వార్త);** ప్రజల ఆరోగ్యమే తన ప్రధాన లక్ష్యమని చాటుతూ మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం కోయగూడెం గ్రామ సర్పంచ్ లింగనాయక్ పలువురు సర్పంచ్ లకు ఆదర్శంగా నిలిచారు.గ్రామంలో దోమల వ్యాప్తిని అరికట్టేందుకు అధికారులు,సిబ్బందిపైనే ఆధారపడకుండా తానే స్వయంగా రంగంలోకి దిగి వీధుల్లో దోమల మందు స్ప్రే చేశారు.పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ఆయన చేసిన ఈ కృషిని చూసి గ్రామస్థులు ప్రశంసలు కురిపించారు.ప్రజాసేవలో ముందంజలో ఉంటూ నిజమైన నాయకత్వానికి నిదర్శనంగా నిలిచిన సర్పంచ్ లింగనాయక్‌ను పలువురు అభినందించారు.

# పోషకాహారంతో ఆరోగ్యం



**జఫర్‌గఢ్/ సెప్టెంబరు 22(జర్నలిస్ట్ వార్త):**
పోషకాహారంతోనే ఆరోగ్యకర సమాజ నిర్మాణం సాధ్యమని అంగన్వాడీ సూపర్‌వైజర్ అనిత అన్నారు. తీగారం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాలు1, 2లో మంగళవారం పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఆకుకూరలు, కూరగాయలు, పప్పుదినుసులు, చిరుధాన్యాలు, పాలు, గుడ్లు, పండ్లను సమతుల్యంగా తీసుకోవాలని సూచించారు. పోషకాహారం తల్లి, శిశువు ఆరోగ్యంతో పాటు చిన్నారుల శారీరక, మానసిక వికాసానికి దోహదపడుతుందన్నారు. పోషకాహార లోపంతో రక్తహీనత, ఎదుగుదలలో వెనుకబాటు వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ కలకోట ఇందిర, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## శ్రీనివాసులు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి



**మహబూబ్‌నగర్/సెప్టెంబరు 22 (జర్నలిస్ట్ వార్త):**
సీనియర్ జర్నలిస్టు పెద్దింటి శ్రీనివాసులు మృతి జర్నలిస్టు వర్గానికి తీరని లోటని టీఎంజేఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు నాగేందర్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ శ్రీనివాసులు కుటుంబ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే ఆర్థిక సాయం అందించాలని కోరారు. కుటుంబానికి అవసరమైన ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టు కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముచ్చట్లు న్యూస్ పేపర్ సీఈవో, ఎడిటర్ సీనియర్ జర్నలిస్ట్ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

## 550 మంది భక్తులకు ఘనంగా అన్నప్రసాద వితరణ



**భీమదేవరపల్లి/సెప్టెంబర్ 22 (జర్నలిస్ట్ వార్త):** గణపతి నవరాత్రుల సందర్భంగా ముల్కనూర్ శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో మంగళవారం ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గణనాథుడిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. సుమారు 550 మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు.
కార్యక్రమానికి ముల్కనూర్ ఎస్సై రాజు ముఖ్యఅతిథిగా హాజరై వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులతో కలిసి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భక్తుల సందడి నెలకొంది.దేవస్థానం చైర్మన్ జక్కుల మల్లికార్జున్, వైస్ చైర్మన్ గిరబోయిన కుమారస్వామి, మాజీ చైర్మన్ జక్కుల ప్రకాశం, యాదవ సంఘం కమిటీ సభ్యులు, ఆలయ నిర్వాహకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గణపతి నవరాత్రుల సందర్భంగా భక్తులకు అన్నప్రసాదం అందించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు